

ప్రభుత్వ వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించాలి 8లో..

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం 8లో..

ప్రీస్కూళ్లుగా అంగన్‌వాడీలు

- సులభతరమైన పద్ధతిలో విద్యా బోధన
- టీచర్లకు పూర్తయిన శిక్షణ
- విద్యార్థులకు ఏకరూప దుస్తులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నా హాలు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు కేవలం పౌష్టికాహారం అందించి ఆటలు ఆడించడమే గాకుండా, చిన్నతనంలోనే వారిలో జ్ఞానం పెంపొందించేందుకు విద్యా బోధన చేయనున్నారు. వారికి అర్థమయ్యే రీతిలో కొన్ని సాధారణ పాఠాలు బోధించే విధంగా పాఠ్యాంశాలను రూపొందించారు. ప్రతి నాలుగు మాసాలకు ఒక కరదీపిక ద్వారా పిల్లలకు పాఠాలు బోధించాలి.

ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా నామకరణం చేయనున్నారు. ఈ కేంద్రాలకు వచ్చే పిల్లలకు రెండు జతల ఏకరూప దుస్తులను కూడా అందజేయనున్నారు. బాల బాలికలకు వేర్వేరుగా రూపొందించిన దుస్తులను కుట్టిస్తున్నారు. పదిహేను రోజుల్లో ఆ దుస్తులను పిల్లలకు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 706 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 652 కేంద్రాల్లో టీచర్లు ఉన్నారు. మిగతా కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తాయి. పర్యవేక్షణ అంతా రాష్ట్ర ప్రభుత్వానిదే ఉంటుంది. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంటారు. వీళ్లకు కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆటలు ఆడించే వాళ్లు. అయితే ఈ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. ప్రస్తుతం జిల్లాలో ఉన్న కేంద్రాల్లో 34,870 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ఆటల తో పాటు విద్యా బోధన కూడా చేయనున్నారు. ఇప్పటివరకు తంగే డు పువ్వు పేరుతో నాలుగు పుస్తకాలు, యూకేజీ వారికి పాలపిట్ట పేరిట ఐదు పుస్తకాలు రూపొందించి పాఠాలు బోధించారు. అయినా పిల్లల్లో విజ్ఞానం పెరగలేదు. నిపుణ్ భారత్ ద్వారా వచ్చిన ప్రియదర్శిని పుస్తకం సంపూర్ణ విజ్ఞానాన్ని కల్పించే విధంగా ఉండడంతో దానిని అనుసరించి విద్యా బోధన చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గత నెలలో విద్యా బోధన చేసే కేంద్రాల టీచర్లకు గత నెలలో శిక్షణ కూడా ఇచ్చారు. అలాగే వారికి పూర్వప్రాథమిక విద్యా కరదీపిక, నాలుగు మాసాలకు బోధించే పాఠ్యాంశాలు గల ప్రియదర్శిని పుస్తకాలను అందజేశారు. వాస్తవానికి జూన్ మాసం నుంచే అంగన్ వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా మారాల్సి ఉంది. కానీ ఆలస్యం అయ్యింది.



ప్రారంభమైన విద్యా బోధన..

పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సులభతరమైన పద్ధతిలో విద్యా బోధనను టీచర్లు ఆరంభించారు. నేను నా శరీరం అనే పాఠం ద్వారా టీచర్లు పిల్లలకు శరీరంలో ఉన్న భాగాలన్నింటినీ చూపెడుతూ విద్యా బోధన చేయనున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి పడుకునే వరకు చేపట్టాల్సిన పరిశుభ్రత గురించి బోధించనున్నారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు, చెట్ల గురించి వివరించడం, పండుగల గురించి వివరించడంతో పాటు ఏ, బీ, సీ, డీలు నేర్పించడం, ఇంగ్లీష్ రైమ్స్ నేర్పించడం వంటివి చేస్తున్నారు. పూర్వ విద్య దశ దాటిన తర్వాత విద్యార్థులు రెగ్యులర్ పాఠశాలల్లో చేరి ఎల్‌కేజీ, యూకేజీ పాఠాలు సులభంగా అర్థమయ్యేందుకు పూర్వ విద్య పాఠ్యాంశాలు దోహద పడనున్నాయి.



ప్రియదర్శిని పుస్తకం

సరళమైన పద్ధతిలో విద్యా బోధన

రవూఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమ శాఖాధికారి

ప్రభుత్వ నిర్ణయం మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా మారుస్తున్నాం. విద్యార్థులకు ఆటలతో పాటు విద్యా బోధన చేయనున్నాం. ఇప్పటికే టీచర్లకు శిక్షణ ఇవ్వడం పూర్తయ్యింది. విద్యార్థులకు సులభతరమైన పద్ధతిలో ప్రియదర్శినిలో పాఠ్యాంశాలను రూపొందించారు. ఆ పాఠాలు పిల్లలకు బాగా ఉపయోగపడనున్నాయి.

'స్వచ్ఛదనం- పచ్చదనం'ను పకడ్బందీగా అమలుచేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశుధ్యం పచ్చదనం పెంపొందించేందుకు ఆగస్టు 5 నుంచి 9 వరకు ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. గురువారం ఆమె హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 5న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో, ప్రతి పట్టణ వార్డులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలని, ఆగస్టు 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురికి కాల్వలను, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధి కుక్కల దాడుల నివారణ చర్యలు, 9న డ్రైడే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కే రవీందర్, మున్సిపల్ కమిషనర్‌లు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా అటవీ అధికారి శివయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఓదెల, ఆగస్టు 1 : మండలంలోని భూసమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ సందర్శించి మండలంలో ఉన్న పెండింగ్ ధరణి సమస్యలు, భూసేకరణ, వివిధ సర్టిఫికెట్ల జారీ మొదలగు అంశాలపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వివిధ సమస్యలపై దరఖాస్తుల సమర్పించేందుకు వచ్చిన రైతులతో మాట్లాడారు. వారి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. మండలంలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో అవసరమైన ధ్రువీకరణ చేపట్టి పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి జారీ చేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సమావేశంలో ఓదెల మండల తహసీల్దార్ యాకన్న, నాయబ్ తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీఎస్‌వో మల్లేశ్, గిర్దావర్ రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి హుండీ ఆదాయం 28.78 లక్షలు

ఓదెల, ఆగస్టు 1 : భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో గురువారం హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. 16 హుండీలను విప్పి లెక్కించగా, 28,78,113 రూపాయలు సమకూరినట్లు ఈవో సదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు సుజాతరెడ్డి, ఈవో సదయ్య, ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశం, ధర్మకర్తలు భత్తుల రమేష్, చింతం మొగిలి, మ్యాడగోని శ్రీకాంత్,చింతం వెంకటస్వామి, ఆరెల్లి మొండయ్యతోపాటు కరీంనగర్‌కు చెందిన శ్రీలత సేవా ట్రస్ట్, అన్నమాచార్య సేవ మహిళా బృందాలు పాల్గొన్నారు. కాగా, మహాయై టెక్నాలజీ సృష్టికర్త చింతం నరేందర్ కుటుంబంతో భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఓదెల గ్రామంలోని శివాలయంలో మొక్కులను సమర్పించి నాగేంద్రుని విగ్రహాలను దర్శించుకున్నారు. నిర్మాణంలో ఉన్న యాత్రికుల సముదాయాన్ని పరిశీలించారు. నిర్మాణం పూర్తికావడానికి సహాయాన్ని అందజేస్తానని తెలిపారు. చైర్మన్ మల్లేశం, ప్రొఫెసర్ చింతం ప్రవీణ్, ధర్మకర్తలు చింతం మొగిలి, ఆరెల్లి మొండయ్య, చింతం వెంకటస్వామి, మ్యాడగోని శ్రీకాంత్ పాల్గొన్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు..

- ఆసుపత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

మంథని, ఆగస్టు 1: వర్షాకాలం కావడంతో మంథని ప్రాంతంలో సీజనల్ వ్యాధులు విజృభిస్తున్నాయి. జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. 15 రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో చోటు చేసుకున్న మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వర పీడితులు, ఓపీలతో ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో రోజురోజుకు ఓపీల సంఖ్య పెరుగుతూ వస్తుండగా అధికంగా జ్వర పీడితులే ఉంటున్నట్లు ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇందులో చాలా మందికి టెస్టులు చేస్తుండగా విష జ్వరాలైన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలుగా నివేదికలు వస్తున్నాయి. మంథని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగుల రద్దీ కొనసాగుతోంది. ఆసుపత్రుల నిండా సెలైన్లు ఎక్కుతున్న జ్వర పీడితులే దర్శనమిస్తున్నారు. రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌ల వద్ద వివిధ రకాల టెస్టుల కోసం వచ్చే రోగులతో ఉదయం, సాయంత్రం రద్దీ కనిపిస్తోంది.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి..

- డాక్టర్ జీ వెంకటరమణ, జనరల్ ఫిజీషియన్, మంథని



వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల కారణంగా ఎవరూ కూడా కలుషిత నీరు, ఆహార పదార్థాలను తీసుకోకూడదు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. దోమలు కుట్టకుండా, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. దోమలు వృద్ధి కాకుండా మురుగునీరు, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి. పైపులైన్ ద్వారా వచ్చే తాగునీటిని నేరుగా సేవించకుండా వేడి చేసి చల్లార్చిన తరువాత తాగడం ఉత్తమం. ఇళ్లలో నీటిని ఫిల్టర్ చేసుకొని తాగాలి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల, ఒళ్ళు నొప్పులు డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్య చేయకుండా ఆసుపత్రులకు వెళ్ళి రక్త, మూత్ర, ఇతర పరీక్షలు చేయించుకొని వైద్య సేవలు పొందాలి. చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దు.

రామగుండం కార్పొరేషన్‌లో అధికారుల బదిలీలు

కోల్‌సిటీ, ఆగస్టు 1: రామగుండం నగరపాలక సంస్థలో వివిధ విభాగాల అధికారులు బదిలీ అయ్యారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు జీహెచ్‌ఎంసీకి బదిలీకాగా, జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్న శ్రీధర్‌కు రామగుండంలో టీపీఓగా, ఇన్‌చార్జి ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్‌లో పనిచేస్తున్న టీపీఎస్ నవీన్‌కు రామగుండంలో పోస్టింగ్ ఇచ్చారు. కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్నారావును టీయూఎఫ్‌ఐడీసీ యూనిట్-3కి బదిలీ చేశారు. ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్న శివనందకు పోస్టింగ్ ఇచ్చారు. కార్పొరేషన్ ఈఈ సుచరణ్‌ను ప్రజారోగ్యశాఖకు బదిలీచేశారు. కార్పొరేషన్ ఆడిటర్ మస్తాన్‌ను హైదరాబాద్ కూకట్‌పల్లి ఆడిట్ విభాగం లీగల్ అడ్వయిజర్‌గా బదిలీచేశారు. ఆయన స్థానంలో గంగాధర్‌రెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు. కార్పొరేషన్ అకౌంటెంట్ అర్చనను నిజామాబాద్‌కు బదిలీ చేశారు. సీనియర్ అకౌంటెంట్ నాగరాజును మంచిర్యాలకు బదిలీ చేయగా, రామగుండంలో ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు. అకౌంట్స్ విభాగం ఇన్‌చార్జిగా అసిస్టెంట్ కమిషనర్ రాయలింగంకు బాధ్యతలు అప్పగించారు. మంచిర్యాలలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్‌కు రామగుండంలో పోస్టింగ్ ఇచ్చారు.

శానిటేషన్ విభాగంలో మార్పులు..

కోల్‌సిటీ, ఆగస్టు 1: రామగుండం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ల జోన్లలో మార్పులు చేశారు. కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ మార్పులకు కసరత్తు చేసినట్టు తెలుస్తోంది. ఔట్‌సోర్సింగ్ విధుల కేటాయింపునకు వారంలో మూడు జాబితాలు తయారు చేశారు. మొదటగా గత నెల 25న జాబితా తయారుచేశారు. ఇందులో నలుగురు సూపర్‌వైజర్ స్థానాలను ముట్టలేదు. తరువాత 2వ జాబితాలో ముగ్గురు సూపర్‌వైజర్లను యధాస్థానంలో ఉంచి వాహనాల ఇన్‌చార్జికి స్థానచలనం కల్పించారు. గురువారం 3వ జాబితాను కమిషనర్ పంపారు. ఇందులో అందరు సూపర్‌వైజర్లకు స్థాన చలనం చేస్తున్నట్టు జాబితా ఇచ్చారు. ఇందులో కొత్తగా ఒక సూపర్‌వైజర్‌ను వాహనాల ఇన్‌చార్జిగా నియమించారు. అలాగే వాహనాల ఇన్‌చార్జిగా పనిచేస్తున్న వ్యక్తిని మున్సిపల్ ఆఫీస్‌రోడ్డు నుంచి ఫైవింక్లయిన్ రోడ్డు వరకు బాధ్యతలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. మళ్లీ అదే వ్యక్తికి వాహనాల బాధ్యతలు కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా వర్షాకాల సీజన్‌లో సూపర్‌వైజర్ల జోన్ మార్పులను పలువురు కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే డివిజన్లలో డ్రైన్ క్లీనర్లు, సిబ్బంది లేరని, పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ఈ సమయంలో ఏరియాలపై అవగాహన ఉన్న సూపర్‌వైజర్లను మార్పులు చేయడం వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంటున్నారు. సిబ్బంది కొరతను తీర్చాల్సిందిగా ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదని, ఇప్పుడు మళ్లీ ఇబ్బందులు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొంటున్నారు.

మున్సిపల్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఆదాయ వనరులు పెంచుకునేందుకు చర్యలు చేపట్టాలి - కలెక్టర్ కోయ శ్రీహర్ష



మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 1: పెద్దపల్లి పట్టణంలో నిర్మిస్తున్న నూతన మున్సిపల్ కార్యాలయాన్ని ఆగస్టు నెలలో పూర్తిచేసి ప్రారంభించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. పెండింగ్ పనులు, గ్రీనరీ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పట్టణంలో విస్తృతంగా పర్యటించి పురపాలక కార్యాలయంలో పట్టణ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎల్లమ్మ చెరువును పరిశీలించిన కలెక్టర్ మినీ ట్యాంక్ బండ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మినీ ట్యాంక్‌బండ్ వద్ద టాయిలెట్లు నిర్మించాలని తెలిపారు. మినీ ట్యాంక్‌బండ్‌లో బోటింగ్ నిర్వహణ కోసం అవసరమైన జెట్టిని త్వరితగతిన తెప్పించాలని, మినీ ట్యాంక్ బండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పురపాలక కార్యాలయంలో పట్టణ అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి మున్సిపాలిటీ సొంత ఆదాయవనరులు పెంచుకునేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో మున్సిపాలిటీకి రావాల్సిన అద్దెలను, ఆస్తి పన్ను, ఇతర పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పురపాలక కార్యాలయాన్ని ఆగస్టు మాసంలో ప్రారంభించుకోవాలని, ఆ దిశగా పెండింగ్ పనులు, కార్యాలయ ఆవరణలో గార్డెనింగ్, గ్రీనరీ పనులనూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పెద్దపల్లి పట్టణం వ్యాప్తంగా ఉన్న కుక్కలను పట్టుకొని రామగుండంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించాలని, అక్కడ కుక్కలకు పూర్తి స్థాయిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని తెలిపారు. పట్టణంలో కుక్కల కారణంగా ఎక్కడ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) ద్వారా పెద్దపల్లి జిల్లాలో 30కోట్ల రూపాయలతో రూపొందించిన అభివృద్ధి పనులను ఆగస్టు నెలలో గ్రౌండ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణంలోని డంప్ యార్డ్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మేనేజర్ శివప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబరాలు



పెద్దపల్లిలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం..



ఖని చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 1: ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకుడు ఈర్ల సురేందర్‌మాదిగ ఆధ్వర్యంలో గురువారం పెద్దపల్లి ఉదయ్‌నగర్‌లో జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల శంకర్, పుల్లూరి మధు, కుక్క రవి, ఈర్ల రవి, పెర్క రాజేశం, శ్రీనివాస్, రామస్వామి, పుల్లూరి సుదర్శన్, జనగామ శ్రావణ్, కుక్క నాగేందర్, రామంచ పురుషోత్తం, కె మల్లేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా, సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్నీ తెలిపారు. మాదిగ ఉపకులాల అభివృద్ధి చెందడానికి ఈ తీర్పు దోహద పడుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

కోల్‌సిటీటౌన్ : ఎస్‌సీ ఏబీసీడీ వర్గీకరణపై అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై గోదావరిఖనిలో దళితవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గురువారం మాదిగ జనచైతన్య సమితి రామగుండం కార్పొరేషన్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రధానచౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల రమేష్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కన్నూరిరాజేష్‌కుమార్, ఈదునూరి నర్సింగ్, స్వామి, కళ్యాణ్, తిరుపతి పాల్గొన్నారు. కాగా, ఎస్‌సీ ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపెల్లి సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 1: ఎస్‌సీ వర్గీకరణ చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో గురువారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, కార్పొరేటర్ మహంకాళి స్వామి మాట్లాడారు. దళిత సంఘాల నాయకులు కోండ్ర శంకర్, గొర్రె రమేష్, తిప్పారపు శ్రీనివాస్, కళ్యాణి సింహాచలం, వడ్డేపల్లి శంకర్, దుర్గా ప్రసాద్, వడ్లూరి శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాష్, భూలోకం, దుర్గారావు, ఉప్పులేటి పర్వతాలు, రాసపల్లి రవికుమార్, కన్నూరి ధర్మేందర్, రొడ్డ సంపత్, వెంకటస్వామి, లింగయ్య, మంద రవికుమార్ పాల్గొన్నారు.

యైటింక్లయన్‌కాలనీ, ఆగస్టు 1: ఎంఆర్‌పీఎస్, బీజేపీ నాయకులు గురువారం అంబేద్కర్ చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణాసంచా కాల్చారు. కొమ్ము గట్టయ్య, యాదగిరి సత్తయ్య, రమాకాంత్, మూకిరి రాజు, వడ్డెపల్లి కుమారస్వామి, వేణుగోపాల్‌రావు, శశి, దాసరి శ్రీనివాస్, పాష, వెంకటి, మారెపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, సుప్రీం కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం తెలంగాణ చౌరస్తాలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సొప్పదండి దుర్గాప్రసాద్, చంద్రమౌళి, కండె సాగర్‌తో పాటు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, ఆగస్టు 1: మండలంలో మాదిగలు సంబరాలు జరుపుకున్నారు. మున్సిపల్ కార్యాలయం ముందు దళిత సంఘాల నాయకులు చుక్క రాజమౌళితో పాటు తిప్పారపు దయాకర్, ప్రభాకర్, శంకర్ లక్ష్మీ, రాంమూర్తి తదితరులు పాల్గొని స్వీట్లు పంపిణీ చేశారు. నారాయణపూర్‌లో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ మండల రమేష్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంచారు.

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 1: మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్, మండల అధ్యక్షుడు కోండ్ర వివేక్‌మాదిగ, పాల రాజేశం, దంతనపల్లి ధర్మయ్య, తాండ్ర మల్లయ్య, బోయిన సదానందం, దుర్గ మల్లేష్, సారయ్య, సదయ్య, దంతనపల్లి సంతోష్, రామస్వామి, సారయ్య, కృష్ణ, సతీష్, సంపత్, సురేష్, గోవర్ధన్, రాజు, రమేష్, రామస్వామి పాల్గొన్నారు.



ఖని చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కొండగట్టు ఈవోగా రామకృష్ణ


నూతన ఈవోకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

మల్యాల, ఆగస్టు 1: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం నూతన ఈవోగా నియమితులైన ఎం.రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. దేవాదాయ శాఖలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఈవోగా నియమితులైన అనంతరం కొండపైకి వచ్చిన ఆయన మొదట స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఈవోకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ప్రస్తుతం ఇన్‌చార్జి ఈవోగా కొనసాగుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్ నుంచి పూర్తి స్థాయి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు నూతన ఈవోను కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, సీనియర్ అసిస్టెంట్‌లు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, రాజేశ్వర్‌రావు, లతాదేవి, లక్ష్మారెడ్డి, ధర్మేందర్, శ్రీనివాస్, లక్ష్మిరాజం, సంపత్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

వాహన త్రైమాసిక పన్నుల బకాయిలు చెల్లించాలి : డీటీసీ

తిమ్మాపూర్, ఆగస్టు1: వాహనాల యాజమానులు త్రైమాసిక పన్ను బకాయిలను సకాలంలో చెల్లించాలని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ పి.పురుషోత్తం కోరారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బైపాస్‌లోని లారీ ఓనర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ప్రచార వాహనాన్ని డిటిసి పురుషోత్తం జెండా ఊపి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమసిక పన్ను బకాయిలు నిర్ణీత సమయంలో చెలించని వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే 200శాతం అపరాధ రుసుముతో పాటు వాహనం జప్తు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనదారులు త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రచారం చేసేందుకు ప్రచార వాహనం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రచార రథం జిల్లాలోని అన్ని మండలాలలో తిరుగుతూ సకాలంలో పన్నులు చెల్లించాలని ప్రచారం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా వాహనదారులు బకాయిగా ఉన్న త్రైమసిక పన్నుల బకాయిలు చెల్లించాలని డిటిసి పురుషోత్తం కోరారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్ చక్రవర్తి, రవి కుమార్, అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అభిలాష్, కానిస్టేబుల్స్, హోంగార్డులు, లారీ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది రమేష్, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ నేత కార్మికుడి మృతి

గంగాధర, ఆగస్టు 1: చికిత్స పొందుతూ నేత కార్మికుడు మృతి చెందినట్లు ఏఎస్సై రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రామడుగు మండలం షానగర్‌కు చెందిన మిట్టపల్లి రమేష్(45) ఇంటి వద్ద సాంచాలు నడుపుతూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గంగాధర మండలం కురిక్యాల శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న ర మేష్‌ను స్థానికులు గమనించి 108 సమాచారం అందించగా కరీంనగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యుల సూచనల మేరకు నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మిట్టపల్లి నరేష్ "ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ తెలిపారు.

రూ.7,200 పలికిన పత్తి ధర

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,200 పలికింది. గురువారం ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,200, కనిష్ఠ ధర రూ.7,100 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన
» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి
» 289కి పెరిగిన మరణాలు


పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!
» జూలై 13న గాజాలో అంతం చేశాం
» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం
» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్లు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్లు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.





కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)


వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు




కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు
» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.





కొనసాగుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరు రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం ఎగువ ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు 8,234 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 5,813 క్యూసెక్కులు వస్తుండగా, కడెం ప్రాజెక్టు నుంచి 2421క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.084 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరుకు నంది పంప్‌హౌస్ నుంచి 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 5.630 టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు.

గాయత్రి పంప్‌హౌస్‌ను సందర్శించిన కలెక్టర్


గాయత్రి పంప్ హౌస్ వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

రామడుగు : మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఆరవ రోజు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా 12,600 కూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇప్పటి వరకు 5.5 టీఎంసీల నీరు మిడ్ మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. పంప్‌హౌస్‌ను గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీటిని పరిశీలించిన అనంతరం అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంపుల సామర్థ్యం, విద్యుత్తు వినియోగం, నీటి విడుదల వివరాలను అడిగారు. డీఈఈ రాంప్రదీప్ కలెక్టర్‌కు పలు వివరాలను వెల్లడించారు. మొత్తం 4, 5 పంపుల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నామని తెలిపారు. ఒక్కో పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఒక రోజుకి ఎత్తిపోస్తున్నామన్నారు. ఒక్కొక్క పంపుకు 139 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎత్తిపోతలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. గాయత్రి పంప్‌హౌస్‌ప్రాంతాన్ని విజ్ఞాన విహారకేంద్రంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని కలెక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా విహార కేంద్రంగా ఏర్పాటు చేయటం ద్వారా సెక్యూరిటీ సమస్యలు వచ్చే అవకాశం ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ప్రాజెక్ట్ గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. అనంతరం పంప్‌హౌస్ ప్రాంతంలో కలెక్టర్ మొక్కలను నాటారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12వేల 600 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 310.22ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 11.68 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎస్సారెస్పీలోకి 50 వేల క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీటి రాక భారీగా పెరిగింది. మహారాష్ట్రలోని అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులు నిండడం వల్ల అక్కడి నుంచి వదులుతున్న నీరు ఎస్సారెస్పీలోకి వస్తోంది. బాబ్లీ ప్రాజెక్టు పైన గల బాలేగావ్ ప్రాజెక్టుకు చెందిన నాలుగు వరద గేట్లను ఎత్తి దిగువకు నీరు వదు లుతున్నారు. గత నెల 31వ తేదీ రాత్రి 9 గంటలకు 11 వేల క్యూసెక్కులను బాలేగావ్ ప్రాజెక్టు నుంచి దిగువకు వదలడం ప్రారంభించగా ఈ నెల 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి సుమారు 50 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బాలేగావ్ నుంచి బాబ్లీ ప్రాజె క్టులోకి వస్తున్న నీరు బాబ్లీ గేట్లు తెరిచి ఉండడం వల్ల నేరుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వస్తున్నాయి. గురువారం రాత్రి 8 గంటల వరకు సుమారు 50 వేల క్యూసెక్కుల కుపైగా వరద నీరు ఎస్సారెస్పీలోకి వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 37.113 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.499 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.579 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

13 మంది సీఐల బదిలీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 1: కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని పలువురు సీఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు గురువారం మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ సీఎస్‌బీ-3 సీఐగా పనిచేస్తున్న జి తిరుమల్ హుజురాబాద్ సీఐగా బదిలీ అయ్యారు. హుజూరాబాద్ సీఐగా పనిచేస్తున్న బి రమేష్ కరీంనగర్ సీసీఎస్ సీఐగా బదిలీ చేశారు. అలాగే ఆసిఫాబాద్ జిల్లా వాంఖిడి సీఐ బి శ్రీనివాస్ కరీంనగర్ సీఎస్‌బీ-3 సీఐగా, రాజన్న సిరిసిల్ల జిల్లా సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న కె ప్రవీణ్‌కుమార్‌ను పెద్దపల్లి సీఐగా, పెద్దపల్లి సీఐగా పనిచేస్తున్న ఆర్ కృష్ణ ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. మల్టీజోన్-1లో మొత్తం 13 మంది సీఐలకు బదిలీలు జరిగాయి.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గంగాధర, ఆగస్టు 1: మండలంలోని వెంకటయ్యపల్లిలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి ఒకరు మృతి చెందాడు. గ్రామానికి చెందిన గుండు అంజయ్య(40) గ్రామంలో గురువారం డిష్ కేబుల్‌ను అమర్చుతున్నాడు. దారి పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసి వైరు అమర్చుతుండగా ప్రమాదవశాత్తు విద్యుతాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు.

టెలికాం అండర్‌గ్రౌండ్‌కు మరమ్మతులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 1: గోదావరిఖని ప్రధానచౌరస్తా నుంచి ఫైవింక్లయిన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై టెలికాం విభాగానికి చెందిన అండర్ గ్రౌండ్ కప్పు కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని గతనెల 28న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి సంబంధిత టెలికాం విభాగం స్పందించింది. గురువారం టెలికాం విభాగం రహదారిపై అండర్‌గ్రౌండ్ కప్పు గొయ్యిని బాగు చేశారు.

5న పాత వస్తువుల వేలం

ఎలిగేడు, ఆగస్టు 1 : ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పాతవస్తువుల వేలం ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం గండ్ర దేవేందర్‌రావు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఈనెల 3న తమ దరఖాస్తును మధ్యాహ్నం 3గంటల లోపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అందజేయాలన్నారు. విరిగి కర్రబెంచీలు, కుర్చీలు, పాత ఇనుపసామాను, విలువైన టేకు దర్వాజాలు, షేరలు వేలం వేయబడుతాయని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మేరకు ఈనిర్ణయం తీసుకున్నట్లు దేవేందర్‌రావు పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

సుల్తానాబాద్, ఆగస్టు 1: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షులు వేల్పుల రాజన్నపటేల్ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. సుల్తానాబాద్‌లో గురువారం జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ఇంచార్జి అరుముల్ల పోచం, రాష్ట్ర నాయకులు శిలారపు పర్వతాలు, రమేష్ ఛారి, కందుల శ్రీనివాస్, ఇగురం రామస్వామి కుమార్ రెడ్డి, బూసారపు సంపత్, లంక శంకర్, మహేష్, భాగ్యలక్ష్మి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

పాలకుర్తి, ఆగస్టు 1: మండలంలోని ముంజంపల్లిలోగల నర్సరీలను ఎంపీడీవో పొల్సాని శశికళ గురువారం పరిశీలించారు. అనంతరం పుట్నూర్‌లో పర్యటించారు. పారిశుధ్య పనులు నిత్యం చేపడుతూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వెంట ఎంపీవో సుదర్శన్,పంచాయతీ కార్యదర్శి ఎస్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 1: ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం గురువారం కార్పొరేషన్ అధ్యక్షుడు అంబాల శంకర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ హాజరై కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మాతంగి శివ, నీలారపు రవి, కాసిపేట రాజయ్య, సురేష్, సదానందం, రాజేందర్, శ్రీను, గౌస్, దేవేందర్, సతీష్ పాల్గొన్నారు.

ఎన్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 1: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జీగా గోలివాడ ప్రసన్నకుమార్ నియామితులయ్యారు.ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌జాదవ్ ఉత్తర్వులు జారీచేశారు.

ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా రమేష్ రాథోడ్

మంథని, ఆగస్టు 1: మంథని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా రమేష్‌రాథోడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌రావు కొత్తగూడెంకు బదిలీకాగా ఆయన స్థానంలో భైంసా నుంచి రమేష్ రాథోడ్ మంథని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా బదిలీ పై వచ్చారు.

గర్రెపల్లిలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

సుల్తానాబాద్, ఆగస్టు 1: మండలంలోని గర్రెపల్లి జీపీనగర్ కాలనీలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. నైవేద్యంతో కూడిన బోనాలను, మొక్కులు సమర్పించి అమ్మ వారి దర్శనం చేసుకున్నారు.

ఆర్థిక సాయం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 1: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన మండలంలోని ఆశన్నపల్లెకు చెందిన మంద అభిలాష్, మంద మనిషాలకు మాజీ జడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. పెండ్లి సంపత్, కదురు రాజిరెడ్డి, కుస హరీష్, నూనేటి కుమార్, ధర్మల రవి, రాజు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 1: ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడి పైన హత్య ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని, దుండగులను కఠినంగా శిక్షించాలని మాజీ జడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అడేపు రాజు, నూనెటి కుమార్ యాదవ్, ధర్మల రవి, తూండ్ల రాజయ్య, కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష - గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 1: ప్రభుత్వ వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించాలని, రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందించేందుకు ఆసుపత్రిలోనే ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని నవజాత శిశు కేంద్రం, ఆర్థో, ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలోని వాష్‌రూమ్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు తమ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని, ఆసుపత్రికి వచ్చే అవుట్ పేషెంట్లకు వైద్య పరీక్షలు త్వరగా పూర్తి చేసి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన వైద్యులకు సూచించారు. జన్మించిన శిశువులకు అవసరమైన ప్రత్యేక మందుల జాబితా అందిస్తే వాటిని సిద్ధం చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఆసుపత్రిలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేందుకు చర్యలు చేపట్టాలని,జనరేటర్‌ను మరమ్మతులు చేయించాలని, మరో జనరేటర్‌కు ప్రతిపాదనలు పంపి జనరేటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన 80పడకల ఆసుపత్రిలో ఆర్‌ఓఆర్ ప్లాంట్‌ను, పాత బిల్డింగ్‌లో ఆర్‌ఓఆర్ ప్లాంట్‌ను త్వరితగతిన ఏర్పాటు చేసి రోగులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సుదర్శన్ బాబుకు ఆసుపత్రిలో విద్యుత్ సమస్య తలెత్తవద్దని, దానికి సంబంధించిన సమస్యలు ఉంటే తనకు చెప్పాలని సూచించారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, ఆసుపత్రిలో మరమ్మతలకు సంబంధించిన ఫైల్ తయారు చేసి పంపించాలని ఆదేశించారు. వైద్యం కోసం వచ్చే రోగులతో మర్యదగా ప్రవర్తించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులకు సూచించారు. ఆయన వెంట ట్రాన్స్‌కో ఎస్‌ఈ సుదర్శన్‌బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ప్రొఫెసర్లు, ఆర్‌ఎంవోలు అప్పారావు, అరుణ ఉన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

జిల్లా కేంద్రంలో..

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 01: ప్రభుత్వ ఆసుపత్రులలో పని చేసే వైద్యులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని, డ్యూటీ టైం లో పూర్తి స్థాయిలో ఆసుపత్రిలోనే ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం, గోదావరిఖని ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు అందుతున్న వైద్య సేవలు, 102 సర్వీస్ సేవలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పౌష్టికాహారం, తీసుకోవాల్సిన మందుల పై ఫాలో అప్ చేస్తున్నారా వంటి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఎంసీహెచ్ పారిశుధ్య నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ సంబంధిత కాంట్రాక్టర్‌కు వెంటనే నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనంపై నిరసన

సుల్తానాబాద్, ఆగస్టు 1: సుల్తానాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ నాయకుల చర్యపై కాంగ్రెస్ కార్యకర్త కిరణ్ సుల్తానాబాద్ బస్టాండ్ వెనక ఉన్న సెల్ టవర్ ఎక్కి తన నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఆరెపల్లి కిరణ్ గురువారం రాత్రి సెల్ టవర్ ఎక్కాడు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడంతో తాను తీవ్రంగా మనస్తాపం చెందానని, రేవంత్ తన ప్రాణమని పేర్కొంటూ టవర్ ఎక్కి కూర్చున్నారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేశాడు. కిరణ్ వెంటనే సెల్ టవర్ దిగి కిందకు రావాలని పోలీసులు ఎంతగానో ప్రయత్నించారు. చివరకు మునీందర్ అనే పోలీసు తీవ్రంగా బ్రతిమిలాడడంతో పాటు సీఐ సుబ్బారెడ్డితో మాట్లాడించడంతో చివరకు కిందకు దిగి వచ్చాడు. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఖనిలో 4.27క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- 13 గ్యాస్ సిలిండర్లు సీజ్..

కోల్‌సిటీ, ఆగస్టు 1: గోదావరిఖని పట్టణంలో గురువారం జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీలు జరిపారు. రమేష్‌నగర్‌లోని టీ సత్యం అనే వ్యక్తి వద్ద 4.27 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 13సిలీండ్లను స్వాధీనం చేసుకున్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలీండ్లను కమర్షియల్‌కు అమ్ముతున్న రాజవీరు అనే వ్యక్తి వద్ద నుంచి 11సిలీండర్లను స్వాధీనం చేసుకున్న పౌరసరఫరాలశాఖ అధికారులు పేర్కొన్నారు. వీరిపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ సంతోష్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ సీజ్

పాలకుర్తి, ఆగస్టు 1:మండల పరిధిలోని కుక్కలగూడూర్‌లో సూర్య గ్యాస్ ఏజెన్సీని గురువారం జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్ సీజ్ చేశారు. తనిఖీల సందర్భంగా అక్కడికి వెళ్లగా గ్యాస్ ఏజెన్సీ యజమాని వచ్చి సహకరించకపోవడంతో సదరు గ్యాస్ ఏజెన్సీని సీజ్ చేశామని, శుక్రవారం మరోసారి తనిఖీలు నిర్వహించనున్నట్లు ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట గుడిపెల్లి, కుక్కలగూడూర్ రేషన్ డీలర్లు ద్రాక్షపెల్లి భూమయ్య, బొంకూరి శంకరయ్య తదితరలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 1: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు గురువారం నిరసన చేపట్టారు. స్థానిక బస్టాండ్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు ఉప్పురాజ్‌కుమార్, రేవెల్లి స్వామి, కనుకుర్తి కార్తీక్, చంద్రమౌళి, ఫహీం, వెన్నం రవీందర్, కాశిపాక వాసు, పల్లె మధు, నెత్తెట్ల సతీష్, జావేద్, లవణ్‌కుమార్, కొంతం సురేష్, వైద శ్రీనివాస్, నటరాజ్, కేశవరెడ్డి, శ్రీదర్, తదితరులున్నారు.

సుల్తానాబాద్, ఆగస్టు 1: సుల్తానాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలాజీరావు, జేఏసీ మాజీ చైర్మన్ సూర శ్యామ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, పట్టణ శాఖ అధ్యక్షులు పారుపల్లి గుణపతి, మొల్గూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఎస్సై శ్రావణ్ కుమార్, పోలీసులు వచ్చి ఆందోళనకారులను అడ్డుకున్నారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సందర్భంగా ఓ కార్యకర్త ఉన్నట్టుండి బొమ్మపై పెట్రోల్ పోయగా ఒక్కసారిగా మంటలు పైకి లేవడంతో పలువురు గాయపడ్డారు.

ఎలిగేడు, ఆగస్టు 1 : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో గురువారం బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి, న్యాతరి పోచయ్య, బాపయ్య, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి రాజేష్, వినోద్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, ఆగస్టు 1 : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ నీలం సరిత, మాజీ జెడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, నాయకులు ఎలబోయిన రాంమూర్తి, చొప్పరి శ్రీనివాస్,సాన సురేష్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

మంథని, ఆగస్టు 1: సీఎం, డిప్యూటీ సీఎంల వ్యాఖ్యలకు ఖండిస్తూ స్థానిక ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వారు గురువారం వినతి పత్రం అందజేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మహిళా విభాగం మంథని నియోజకవర్గ ఇంచార్జి గీతాబాయి, మాజీ జెడ్పీటీసీ తగరం సుమలత, నాయకురాళ్ళు బుద్దార్తి రాణి, పుప్పాల భాగ్యలక్ష్మి, చంద్రకళ, రాజేశ్వరి, సునీత, మహిళలు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

గోదావరిఖని, ఆగస్టు 1: అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక చౌరస్తాలో నిరసన కార్యక్రమం జరిగింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళలు, నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించారు. ఈ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు చౌరస్తాలో బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 1: పెద్దపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ శ్రీ హర్షకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.జ్యోతి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ఐదు నుంచి పది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.రవీందర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి అశోక్ దాసరి లక్ష్మి, పెరక పద్మ, ఎస్ ఉమా, జి రేణుక, కే సంపత్ ,ఈర్ల రవి, పడాల పద్మ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

పాలకుర్తి, ఆగస్టు 1: మండలంలోని రాజీవ్ తండాలో గురువారం తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గిరిజన మహిళలు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, మాజీ సర్పంచ్ లాల్‌సింగ్‌లు ముఖ్య అతిథులుగా హాజరు కాగా మాజీ సర్పంచ్ జ్యోతి శంకర్‌నాయక్, తండా పెద్దలు కెల్దాన్, సారయ్య, కారోబార్‌సమ్మయ్య, శేక్‌లాల్, ఫూల్ చంద్, చందు, గట్టయ్య, జగన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'మహిళల సాధికారతే లక్ష్యం'

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 1: మహిళల సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని జిల్లా మహిళ సాధికారిత కేంద్రం మిషన్ కో ఆర్డినేటర్ దయా అరుణ, ఫైనాన్షియల్ లిటరసీ ఎస్.సంధ్య అన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వంద రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మండలంలోని హన్మంతునిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దయా అరుణ హాజరై మహిళలకు, తల్లులకు మహిళ సాధికారత, తల్లి పాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో , పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రేమలత, అంగన్‌వాడి టీచర్ రేణుక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు ఈడీ సన్మానం



రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న ఈడీ కేదార్ రంజన్

జ్యోతినగర్, ఆగస్టు 1: రామగుండం ఎన్టీపీసీలో పదవీ విరమణ చేసిన తొమ్మిది మంది ఉదోగులను ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు, అధికారులు ఘనంగా సన్మానించారు. బుధవారం రాత్రి పీటీఎస్‌లోని కాకతీయ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన ఇ.విష్ణువర్ధన్‌రావు, కందుల స్వామి, ఎం.జె.నాయుడు, ప్రభాకర్‌రావు, నాగేశ్వర్‌రావు, అబ్దుల్ కరీం, శ్రీనివాస్ రెడ్డి, గౌతమ కుమార్ హల్దార్, కె.డేవిడ్‌లను ఈడీ శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈడీ మాటాడుతూ ఎన్టీపీసీ అభివృద్ధిలో సుదీర్ఘ కాలంపాటు పని చేసిన ఉదోగులు, తమ శేష జీవితంలో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిద విభాగాల జీఎంలు, హెచ్‌వోడీలు, గుర్తింపు కార్మిక సంగం నాయకులు ఆరెపల్లి రాజేశ్వర్, యుగంధర్‌రావు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సెక్రెడ్‌హార్ట్ స్కూల్‌కు పూర్వ విద్యార్థుల విరాళం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 1: చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయాలన్న సంకల్పంతో పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధిలో చేయూతగా నిలిచారు. గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్ 1981-1982బ్యాచ్ ఏడో తరగతి పూర్వ విద్యార్థులు. పూర్వవిద్యార్థులు సేకరించిన రూ.లక్షా 50వేల చెక్కును గురువారం పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు. పాఠశాలలో సైన్స్ ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటుకు విరాళంగా అందజేసినట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు. విద్యాబుద్ధులు చెప్పిన పాఠశాల అభివృద్ధిలో తాము భాగస్వాములు కావడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అనీష్‌గుప్తా, రాజీవ్ గంగుల్ల, షీలా, గౌతమ్, సోమయాజులు, దేవేందర్‌రెడ్డి, మాటూరి శ్రీనివాస్, హేమరాధ, హెచ్ సీత, లిదియా, సంధ్య, వెంకట్‌రెడ్డి, సత్యకీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మహాసభను విజయవంతం చేయండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, ఆగస్టు 1: పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని ద గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్ హాల్‌లో నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభకు అధిక సంఖ్యలో బీసీలు తరలి వెళ్ళి విజయంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కోరారు. ఈమహా సభకు సంబంధించిన (చలో అమృత్ సర్) కరపత్రాన్ని పుట్ట మధు తన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నల్లవెల్లి శంకర్, రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రాంకుమార్, ఇందారం మల్లయ్య, తోట రాజ్ కుమార్, దూస సదాశివ్‌లు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్‌కు సన్మానం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 1: గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై మెదక్ ప్రభుత్వ బాలుర కళాశాలకు వెళుతున్న మాధవిని అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. గురువారం కళాశాలలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో మాధవి దంపతులను అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్, హస్మత్ అలీ తదితరుల పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుధాకర్

కమాన్‌పూర్, ఆగస్టు 1: మండలంలోని గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జూలపల్లి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ విధులు నిర్వహిస్తున్న కాసిమల్ల సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ సునంద జనగామ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీయ్యారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల, ఆగస్టు 1: మండల కేంద్రంలోని రైల్వే గేట్ వద్ద గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి కాంగ్రెస్ నాయ కులు క్షీరాభిషేకం నిర్వహించారు. పార్లమెంటులో ఎంపీ మాట్లాడుతూ ఓదెల రైల్వే స్టేషన్లో తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు, అలాగే బల్లార్ష నుంచి అజ్నీ రైలును పునః ప్రారంభించాలని కోరడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అల్లం సతీష్, గోపతి ఎల్లయ్య, మార్క సతీష్, గుర్రాల శ్రీధర్, మీనుగు సంతోష్, రాచర్ల ఓదెలు, గోవతి ఎర్ర మల్లయ్య తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

మంథని, ఆగస్టు 1: వర్షాకాలంలో ప్రజలంతా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య కోరారు. స్థానిక శ్రీపాదకాలనీలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు.

కమాన్‌పూర్, ఆగస్టు 1: మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో పారిశుధ్య పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్ పరిశీలించారు. మురికి కాలువలో వద్ద పెరిగిన పిచ్చి చెట్లను, చెత్త చెదారాన్ని వెంటనే తొలగించాలని సూచించారు.

ఓదెల, ఆగస్టు 1: మండలంలోని కొలనూర్ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్‌వ్యాధుల నివారణ, రోగనిరోధక శక్తిపై హెచ్‌ఎం ఏసుదాసు అధ్యక్షతన అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.



కార్మికుల సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి కరువు

- ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

రామగిరి, ఆగస్టు 1: కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం చిత్తశుద్ధి కరువైయ్యిందని ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య ఆరోపించారు. గురువారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో కార్మికులనుద్దేశించిన మాట్లాడారు. ఓసీపీ-2లో ఇటీవల ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మైనింగ్ స్టాఫ్‌కు అండగా ఉంటామన్నారు. సంస్థ లాభాల్లో 35 శాతం వాటాను కార్మికులకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈపీ ఆపరేటర్‌ల ప్రమోషన్ పాలసీ సైతం కొనసాగించడం లేదని, పూర్తిచేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వై.వీరావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, సంపత్, సాదిక్, రాజు సురేందర్, రాజయ్య, వెంకటస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల ద్వారానే సంస్థ పరిరక్షణ సాధ్యం

యైటింక్లయన్‌కాలనీ, ఆగస్టు 1: ఐక్య పోరాటాల ద్వారానే సింగరేణి పరిరక్షణ సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ వీరయ్య అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నదని, ఈ క్రమంలో బొగ్గు గనులను వేలం వేస్తున్నట్టు ఆయన తెలిపారు. కేంద్ర బొగ్గు మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేలం ప్రక్రియలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనడం కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని వీరయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని గనులు సింగరేణికి కేటాయించాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపాలని డిమాండ్ చేశారు. అన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు కలిసి పోరాటాలు చేస్తేనే వేలంను అడ్డుకునే అవకాశం ఉన్నదని, సింగరేణిని కాపాడుకోడానికి అన్ని సంఘాలు ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని వీరయ్య అన్నారు. సింగరేణి ఉనికిని కాపాడేలా కేంద్రం రాష్ట్ర పరిధిలోని గనులను సింగరేణికి కేటాయించాలని వీరయ్య డిమాండ్ చేశారు. ఈవిలేకరుల సమావేశంలో భూపాల్, యాకయ్య, నర్సింహారావు, ముత్యంరావు, మహేశ్వరి, ప్రవీణ్, ఉల్లి మొగిలి, ఎస్ వెంకన్న, విజయ్ కుమార్‌రెడ్డి, కొంరయ్య, మెండె శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూలైలో ఆర్జీ-2 ఉత్పత్తి 114 శాతం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 1: గడిచిన జులై నెలలో ఆర్జీ-2 ఏరియా 114 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు ఏరియా జనరల్ మేనేజర్ సూర్యనారాయణ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. జులై నెల టార్గెట్ 4,80,500 టన్నులు కాగా 5,47,374 టన్నుల బొగ్గు ఉత్పత్తి (114%) జరిగినట్టు తెలిపారు. ఓసీపీ-3 ప్రాజెక్టు టార్గెట్ 4,50,000 టన్నులు కాగా 5,15,492 టన్నుల బొగ్గు ఉత్పత్తి(115%) జరిగినట్టు సూర్యనారాయణ పేర్కొన్నారు. వకీల్‌పల్లె గని లక్ష్యం 30,500 టన్నులకు గాను 31,882 టన్నులు(105%) సాధించినట్టు జీఎం పేర్కొన్నారు. ఆర్జీ-2 ఏరియా నుండి 25,48,752 టన్నుల బొగ్గు రవాణా జరిగినట్టు జీఎం తెలిపారు. గడిచిన నెలలో ఎడతెరపి లేకుండా వర్షాలు పడినా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించినట్టు జీఎం తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ షాక్‌కు గురికాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉద్యోగులు జాగ్రత్తలు వహించాలని జీఎం సూచించారు.

ఈ విలేకరుల సమావేశంలో డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, అధికారులు ఎర్రన్న, ధనుంజయ, మురళీకృష్ణ, డాక్టర్ మహిపాల్, డాక్టర్ మహిపాల్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్జీ-3లో 97 శాతం ఉత్పత్తి..

రామగిరి, ఆగస్టు 1: సింగరేణి ఆర్జీ-3 డివిజన్‌లో జూలైలో 97 శాతం ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆర్జీ-3 డివిజన్‌కు నిర్దేశించిన 4.19 లక్షల టన్నులకు 4.08 లక్షలు సాధించి 97శాతంలో నిలిచిందన్నారు. ఏపీఏకు నిర్దేశించిన 0.18 లక్షల టన్నులకు 0.52లక్షల టన్నులు సాధించి 292 శాతం నిలిచాయని పేర్కొన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత

సింగరేణి సంస్థ ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏపిఏలో 34 మంది డిపెండెంట్లకు గురువారం కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేశారు. ప్రాజెక్టు కార్యాలయంలోని ఎంవీటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సత్యనారాయణ, మల్లన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం

గోదావరిఖని, ఆగస్టు 1: సింగరేణి ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ ఆర్‌జీ-1, 2, 3, భూపాలపల్లి ఏరియాల ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం స్థానిక మార్కండేయకాలనీలోని ఒక ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఆర్‌జీ-1 వైస్ ప్రెసిడెంట్ సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి యూనియన్ సెక్రెటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతనమండలి చైర్మన్ జనక్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సమావేశంలో రామగుండం రీజియన్ పరిధిలో నాలుగు ఏరియాల నుంచి పెద్దసంఖ్యలో సెంట్రల్ నాయకులు, బ్రాంచ్ నాయకులు, పిట్ నాయకులు పాల్గొని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద చర్చించి జనక్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా కార్మికులు ఎదుర్కుంటున్న ముఖ్య సమస్యలపై మాట్లాడటం జరిగింది. అంతే కాకుండా కార్మికుల సంబంధించిన పెర్క్స్ మీద ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు, సొంతింటి కల, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, యూనియన్ బలోపేతం విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, జనరల్ సెక్రెటరీలు లక్ష్మీపతి గౌడ్, సెక్రెటరీ అక్రం, నాయకులు జెట్టి శంకర్ రావు, కలవేన శ్యామ్, వికాస్‌కుమార్‌యాదవ్, నరేందర్, తిరుపతి రాజు, భీంరావ్, దొర, కొత్త సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, దేవి భూమయ్య, జోగా బుచ్చయ్య, ఆరెపల్లి శ్రీనివాస్, గడ్డం కృష్ణ, పల్లురి లక్ష్మణ్, నాయకురాళ్లు శేషారత్నం, శారద పాల్గొన్నారు.

జనక్ ప్రసాద్‌కు ఘన స్వాగతం

తెలంగాణ ప్రభుత్వ కనీస వేతనాల మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్ ప్రసాద్‌కు కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ శ్రేణులు గురువారం ఖనిలో ఘనంగా స్వాగతం పలికాయి. వేతనాల మండలి చైర్మన్‌గా నియమితులైన తరువాత తొలిసారిగా గోదావరిఖనికి వచ్చిన జనక్ ప్రసాద్‌ను రామగుండం బీ పవర్‌హౌస్ వద్ద ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీగా జనక్ ప్రసాద్‌ను స్వాగతించారు. మున్సిపల్ కూడలిలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, గోదావరిఖని ప్రధానచౌరస్తాలోని మహాత్మా గాంధీ విగ్రహానికి జనక్ ప్రసాద్ పూలమాలలు వేశారు. ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నర్సింహారెడ్డి, ధర్మపురి, జనరల్ సెక్రటరీలు లక్ష్మీపతిగౌడ్, అక్రం, జిల్లా అధ్యక్షుడు దాస్, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్ కుమార్, కేంద్ర ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్, ఆర్‌జీ-1 ఉపాధ్యక్షులు సదానందం, ఆర్‌జీ-2 ఉపాధ్యక్షులు కొత్త సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్